అట్టహాసంగా జేపీఎల్ ట్రోఫీ ఆవిష్కరణ

- ఈనెల 20 నుంచి టీ20 క్రికెట్ లీగ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఈనెల 20-25 మధ్య జరుగబోయే కేఎస్‌జీ జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ (జేపీఎల్)లో భాగంగా ఆదివారం ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా ముగిసింది. ఆదివారం ఎల్బీ స్టేడియంలోని సమావేశ మందిరంలో జరిగిన ఈ వేడుకకు బీసీసీఐ మాజీ చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్, శాట్జ్ చైర్మన్ శివసేనా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ట్రోఫీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెస్కే మాట్లాడుతూ.. ఏ క్రీడలో అయినా వర్ధమాన ఆటగాళ్లను వెలుగులోకి తేవాలంటే అది క్రీడా జర్నలిస్టులతోనే సాధ్యమవుతుందని, వారి కష్టాన్ని ప్రతిఒక్కరూ గుర్తించి గౌరవించాలన్నారు. ఈ టోర్నీకి శాట్జ్ తరపున పూర్తి సహకారం అందిస్తామని శివసేనా రెడ్డి చెప్పారు. అనంతరం కేఎస్‌జీ చైర్మన్, ఇండి రేసింగ్ టీమ్ ఓనర్ కె. అభిషేక్ రెడ్డి, త్రుక్ష ఫుడ్స్ ఎండీ భరత్ రెడ్డి, లైఫ్ స్పాన్ ప్రతినిధి భరణి 10 జట్ల కెప్టెన్లకు క్యాప్స్ అందించారు.

భారత్‌దే లెజెండ్స్ ట్రోఫీ

ఫైనల్‌లో పాకిస్థాన్ ఓటమి

ఎడ్జ్‌బాస్టన్: అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన మాజీ క్రికెటర్లు ఆడే 'వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్' టైటిల్‌ను భారత్ కైవసం చేసుకుంది. యువరాజ్ సింగ్ సారథ్యంలోని టీమ్‌ఇండియా ఫైనల్‌లో 5 వికెట్ల తేడాతో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను ఓడించింది. ఈనెల 3 నుంచి 13 దాకా జరిగిన ఈ టోర్నీలో భాగంగా భారత కాలమానం ప్రకారం శనివారం రాత్రి ముగిసిన ఫైనల్‌లో యూనిస్ ఖాన్ సారథ్యంలోని పాక్ జట్టు మొదట బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 156/6 పరుగులు చేసింది. షోయబ్ మాలిక్ (41) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో అనురీత్ సింగ్ (3/43) రాణించాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన భారత్.. 19.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని పూర్తిచేసింది. అంబటి రాయుడు (50) అర్ధ సెంచరీతో రాణించగా గురుకీరత్ (34), యూసుఫ్ పఠాన్ (30) దూకుడుగా ఆడి భారత్ విజయాన్ని ఖాయం చేశారు.

మీరు రాకుంటే మేమూ రాం!

చాంపియన్స్ ట్రోఫీలో హైబ్రిడ్ మోడల్‌ను వ్యతిరేకిస్తున్న పాక్

లాహోర్: వచ్చే ఏడాది తమ దేశంలో జరుగబోయే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనేందుకు భారత్ నిరాకరించడంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మరోసారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ టోర్నీలో ఆడేందుకు భారత జట్టు పాకిస్థాన్‌కు రాకుంటే 2026లో భారత్/శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చే టీ20 వరల్డ్ కప్‌లో తాము ఆడబోమని హెచ్చరించినట్టు పాక్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అంతేగాక చాంపియన్స్ ట్రోఫీలో హైబ్రిడ్ మోడల్‌నూ తాము అంగీకరించబోమని టోర్నీ మొత్తం పాక్‌లోనే జరగాలని పీసీబీ పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. కాగా ఈ విషయంలో ఐసీసీ ఇరు దేశాల బోర్డులను ఎలా సమన్వయపరుస్తుంది..? ఈ సమస్యకు ఏ పరిష్కారం కనుగొంటుందో తెలియాలంటే ఈనెల 22 దాకా ఆగాల్సిందే. జూలై 19-22 మధ్య కొలంబో (శ్రీలంక) వేదికగా జరిగే ఐసీసీ వార్షిక సమావేశంలో దీనిపై ఓ స్పష్టత వచ్చే అవకాశముంది.

నేటి నుంచే 'మాన్‌సూన్ రెగట్టా'

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్, ద యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి హుసేన్‌సాగర్ వేదికగా 15వ 'మాన్‌సూన్ రెగట్టా' పోటీలు ప్రారంభం కానున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఒడిషా, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సుమారు 140 మంది సెయిలర్లు ఈ పోటీలలో పాల్గొననున్నారు. ఈ ఏడాది అండర్-18లో కొత్తగా ఐఎల్‌సీఎ4, 29ఈఆర్, ఇంటర్నేషనల్ 420 విభాగాలను చేర్చినట్టు నిర్వాహకులు తెలిపారు. అండర్-16లో తెలంగాణ అమ్మాయి కొమరవెల్లి దీక్షిత టాప్‌సీడ్‌గా బరిలోకి దిగనుంది. ఈనెల 20న పోటీలు ముగుస్తాయి.

గైక్వాడ్‌కు ఆర్థిక సాయం

ఢిల్లీ: ఏడాదికాలంగా క్యాన్సర్‌తో పోరాడుతున్న భారత మాజీ క్రికెటర్ అన్షుమన్ గైక్వాడ్‌కు బీసీసీఐ కోటి రూపాయల ఆర్థిక సాయం ప్రకటించింది. ఈ మేరకు కార్యదర్శి జై షా బీసీసీఐ అధికారులను ఆదేశించినట్టు బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది. 'క్యాన్సర్ బారినపడ్డ భారత మాజీ క్రికెటర్ అన్షుమన్‌కు తక్షణ సాయం కింద కోటి రూపాయలను విడుదల చేయాలని కార్యదర్శి జై షా ఆదేశించారు. ఆయన కుటుంబసభ్యులతోనూ జై షా మాట్లాడారు. గైక్వాడ్ కుటుంబానికి బీసీసీఐ అండగా ఉంటుంది' అని ప్రకటనలో పేర్కొంది. బ్లడ్ క్యాన్సర్‌తో లండన్‌లోని కింగ్స్ కాలేజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న గైక్వాడ్‌కు తన మాజీ సహచర ఆటగాళ్లు కపిల్‌దేవ్, గవాస్కర్, సందీప్ పాటిల్ వంటి పలువురు సాయమందిస్తున్నారు. ఈ విషయాన్ని సందీప్ పాటిల్ ముందుగా బీసీసీఐ దృష్టికి తీసుకువచ్చాడు. 1975 నుంచి 1987 దాకా భారత్ తరపున 40 టెస్టులు, 15 వన్డేలు ఆడిన గైక్వాడ్.. టీమ్‌ఇండియాకు రెండుమార్లు హెడ్‌కోచ్‌గా కూడా పనిచేశారు.

కింగ్ అల్కారజ్

ఫైనల్‌లో జొకోవిచ్‌పై విజయం • వరుసగా రెండో ఏడాది టైటిల్ కైవసం

అదే కోర్టు! వాళ్లే ప్రత్యర్థులు!! కానీ ఫలితం మాత్రం మారలేదు. గతేడాది వింబుల్డన్‌లో పురుషుల సింగిల్స్ ఫైనల్స్‌కు రీమ్యాచ్‌గా ఆదివారం ముగిసిన తుదిపోరులోనూ స్పెయిన్ కుర్రాడు కార్లోస్ అల్కారజ్ అదరగొట్టి వింబుల్డన్ కోటలో మరోసారి పాగా వేశాడు. వరుసగా రెండో ఏడాది ఈ ప్రతిష్టాత్మక టైటిల్‌ను కైవసం చేసుకుని చరిత్ర సృష్టించాడు. తన కెరీర్‌లో 25వ టైటిల్ గెలవాలన్న దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించి ఆరు వారాల వ్యవధిలో రెండు గ్రాండ్ స్లామ్స్ (ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్) కైవసం చేసుకున్నాడు.

లండన్: ప్రతిష్టాత్మక వింబుల్డన్ టోర్నీని మూడో సీడ్ కార్లోస్ అల్కారజ్ వరుసగా రెండో ఏడాది గెలుచుకున్నాడు. ఆదివారం సెంటర్ కోర్టు వేదికగా జరిగిన ఫైనల్‌లో ఈ నయా స్పెయిన్ బుల్ 6-2, 6-2, 7-6 (7/4)తో నొవాక్ జొకోవిచ్ (సెర్బియా)పై నెగ్గి 21 ఏండ్ల వయసులోనే నాలుగు గ్రాండ్‌స్లామ్స్ సాధించాడు. గత వింబుల్డన్ ఫైనల్‌లో ఓడినా ఐదు సెట్ల పాటు హోరాహోరీగా పోరాడిన జొకో.. ఈ మ్యాచ్‌లో మాత్రం ఆ పట్టుదల, దూకుడు, పోరాటతత్వం లేకుండానే టోర్నీని ముగించాడు. 2 గంటల 27 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో తొలి రెండు సెట్లను అలవోకగా నెగ్గిన అల్కారజ్‌కు మూడో సెట్‌లో ప్రత్యర్థి నుంచి కాస్త ప్రతిఘటన ఎదురైంది. కీలకమైన ఈ సెట్‌ను దక్కించుకోవడానికి ఇరువురూ పోరాడినా స్కోర్లు సమం కావడంతో ఆట కాస్తా టైబ్రేక్‌కు వెళ్లింది. ఇక టైబ్రేక్‌లో అల్కారజ్.. జొకోను పదే పదే నెట్‌కు దగ్గరగా రప్పిస్తూ పాయింట్లు రాబట్టి సెట్‌తో పాటు మ్యాచ్‌నూ సొంతం చేసుకున్నాడు. ఫైనల్‌లో అల్కారజ్ 5 ఏస్‌లు సంధించి 42 విన్నర్లు కొట్టాడు. 8 ఏస్‌లు కొట్టిన జొకో 26 విన్నర్స్‌కే పరిమితమయ్యాడు. ఈ విజయంతో ఒకే ఏడాది వరుసగా ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టైటిల్స్‌ను గెలిచిన ఆరో టెన్నిస్ ప్లేయర్‌గా అల్కారజ్ నిలిచాడు.

విజేత	అల్కారజ్	రూ. 28.60 కోట్లు
రన్నరప్	జొకోవిచ్	రూ. 14.00 కోట్లు

విజయంతో ముగించారు

ఐదో టీ20లోనూ భారత్ గెలుపు • సిరీస్ 4-1తో కైవసం • రాణించిన శాంసన్, ముకేశ్

సీనియర్ల గైర్హాజరీలో జింబాబ్వేకు వెళ్లిన యువ భారత జట్టు ఈ పర్యటనను విజయంతో ముగించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టీ20లోనే అనూహ్య ఓటమి ఎదురైనా తర్వాత పుంజుకుని వరుసగా నాలుగు మ్యాచ్‌లలోనూ ఆతిథ్య జట్టుకు చుక్కలు చూపించింది. హరారే వేదికగా జరిగిన ఆఖరి టీ20లో భారత్ బ్యాట్‌తో ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయినా బంతితో మాత్రం రెచ్చిపోయి సిరీస్‌ను 4-1తో గెలుచుకుంది. బ్యాట్‌తో సంజూ శాంసన్, బంతితో ముకేశ్ కుమార్ రాణించారు.

హరారే: జింబాబ్వే పర్యటనలో యువ భారత జట్టు అదరగొట్టింది. ఆదివారం ఆతిథ్య జట్టుతో జరిగిన ఐదో టీ20లో జింబాబ్వేపై 42 పరుగుల తేడాతో గెలిచింది. సంజూ శాంసన్ (45 బంతుల్లో 58, 1 ఫోర్, 4 సిక్సర్లు), శివమ్ దూబె (12 బంతుల్లో 26, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించడంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. మోస్తరు లక్ష్య ఛేదనలో జింబాబ్వే 18.3 ఓవర్లలో 125 పరుగులకే చాప చుట్టేసింది. డియోన్ మైర్స్ (32 బంతుల్లో 34, 4 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. భారత బౌలర్లలో ముకేశ్ కుమార్ (4/22), దూబె (2/25) ధాటికి జింబాబ్వే బ్యాటర్లు తోకముడిచారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న దూబెకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కగా సిరీస్ ఆసాంతం రాణించిన వాషింగ్టన్ సుందర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' లభించింది.

ఆదుకున్న శాంసన్:

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ పవర్ ప్లేలోనే మూడు కీలక వికెట్లు కోల్పోయింది. భారత ఇన్నింగ్స్‌లో తొలి రెండు బంతులను భారీ సిక్సర్లుగా మలిచిన జైస్వాల్ (12).. రజా వేసిన నాలుగో బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. వేగంగా ఆడిన అభిషేక్ (14), శుభ్‌మన్ గిల్ (13) సైతం విఫలమవడంతో భారత్ 40 పరుగులకే మూడు వికెట్లు నష్టపోయింది. ఈ క్రమంలో శాంసన్, రియాన్ పరాగ్ (22) భారత్‌ను ఆదుకున్నారు. ఇద్దరూ వికెట్ల పతనానికి అడ్డుకట్ట వేయడమే గాక స్కోరుబోర్డునూ ముందుకు నడిపించారు. జింబాబ్వే బౌలర్లు కట్టడిచేయడంతో మధ్య ఓవర్లలో పరుగుల రాక మందగించినా వీలుచిక్కినప్పుడల్లా శాంసన్ సిక్సర్లు బాదాడు. మవుట 15వ ఓవర్లో పరాగ్ నిష్క్రమించడంతో 65 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అర్ధ సెంచరీ పూర్తిచేశాక శాంసన్‌ను ముజరబని ఔట్ చేశాడు. క్రీజులోకి రాగానే మూడో బంతికి సిక్స్ బాదిన దూబె ఎంగర్వ 19వ ఓవర్లో 4,6,4 తో భారత స్కోరును 150 మార్కు దాటించాడు.

ముకేశ్ పేస్‌కు విలవిల:

ఛేదనలో జింబాబ్వేను ముకేశ్ వణికించాడు. తొలి ఓవర్లో మూడో బంతికే ఓపెనర్ వెస్లీని బౌల్డ్ చేసిన అతడు.. మూడో ఓవర్లో బెన్నెట్ (10)ను ఔట్ చేశాడు. 5 ఫోర్లతో జోరుమీదున్న మరుమని (27) వాషింగ్టన్ సుందర్ 9వ ఓవర్లో వికెట్ల ముందు దొరికిపోయాడు. డియోన్‌నును పెవిలియన్ కు పంపిన దూబె.. అద్భుత త్రో తో రజా (8)ను రనౌట్ చేశాడు. ఆ తర్వాత వచ్చిన జింబాబ్వే బ్యాటర్లలో ఫరజ్ అక్రమ్ (13 బంతుల్లో 27, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) వేగంగా ఆడేందుకు ప్రయత్నించినా ముకేశ్ 19వ ఓవర్లో అతడి ఆట కట్టించడంతో ఆతిథ్య జట్టు ఓటమి ఖరారైంది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 167/6 (సంజూ 58, దూబె 26, ముజరబని 2/19, రజా 1/37). **జింబాబ్వే:** 18.3 ఓవర్లలో 125 ఆలౌట్ (డియోన్ 34, అక్రమ్ 27, ముకేశ్ 4/22, దూబె 2/25)

కేసీఆర్‌ది మానవీయ ప్రభుత్వం

- బీఆర్ఎస్ హయాంలో తగ్గిన రైతుల ఆత్మహత్యలు
- నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలే నిదర్శనం

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పదేండ్లపాటు కేసీఆర్ ప్రజా ప్రభుత్వం నడిపారని, మానవీయ పాలన కొనసాగించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని పేర్కొన్నారు. ఇందుకు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకటించిన గణాంకాలే నిదర్శనమని ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తెలంగాణలో 2015 నుంచి 2022 వరకు రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గినట్టు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో విడుదల చేసిన గణాంకాల చార్ట్‌ను అరవింద్ వారియర్ అనే నెటిజన్ పెట్టిన ట్వీట్‌కు కేటీఆర్ రీ ట్వీట్ చేశారు.

ఉమ్మడి రాష్ట్రంలో కరువు

'ఉమ్మడి పాలనలో తెలంగాణ ప్రాంతం అత్యంత కరువు పీడిత ప్రాంతాల్లో ఒకటిగా నిలిచింది. ఉద్దేశపూర్వంగా గత పాలకులు నీటి వనరులను నిర్లక్ష్యంగా చేయడం మూలంగా తీవ్ర కరువుకాటకాలను అనుభవించింది. ఫలితంగా రైతులు పంటల సాగుకు అనేక ఇబ్బందులు పడ్డారు. సాగునీటి వనరులు లేక వ్యవసాయం

గిట్టుబాటుగాక, అనేక మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. 2014 సంవత్సరానికి ముందు భారీ సంఖ్యలో రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు.' '2014 తర్వాత ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడం, కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కొలువుదీరడంతో పరిస్థితులు ఒక్కసారిగా కొలిక్కివచ్చాయి. కొత్త ప్రాజెక్టుల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణతో సాగునీటి వసతులు మెరుగుపడ్డాయి. వ్యవసాయం పండుగలా మారింది. క్రమంగా రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయి. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, సమిష్టి ప్రయత్నాలు వ్యవసాయాన్ని సులభతరంగా మార్చాయి. రైతు జీవితాలు మెరుగుపడ్డాయి. ఇది కాదా.. మానవీయ ప్రభుత్వం అంటే' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ట్వీట్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఎనిమిదేండ్లలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గినట్టు తెలిపారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో విడుదల చేసిన గణాంకాల చార్ట్‌ను రీ ట్వీట్ చేశారు.

తగ్గిన రైతుల ఆత్మహత్యల శాతం

2015లో 11.1%	2016లో 5.66%
2017 7.98%	2018 8.77%
2019 4.85%	2020 4.41%
2021 3.29%	2022 1.57%

అప్పుల బాధతో రైతు బలవన్మరణం

పెట్టుబడుల కోసం 4 లక్షల అప్పు

- దిగుబడి రాక అప్పు తీరక మనస్తాపం
- పురుగుల మందు తాగి ఆత్మహత్య

తాంసి, జూలై 14: అప్పుల బాధ భరించలేక మనస్తాపంతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలో వెలుగుచూసింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ రూరల్ మండలం బట్టిసావర్గం గ్రామానికి చెందిన రైతు జక్కుల పెద్ద రాజన్న అలియాస్ పోతన్న(48)కు పదికరాల వ్యవసాయ భూమి ఉన్నది. పెట్టుబడి కోసం రూ.4 లక్షలు అప్పు చేశాడు. రెండేండ్లుగా దిగుబడులు సక్రమంగా రాకపోవడంతో అప్పులు తీరలేదు. అప్పుల వాళ్లు ఇంటికి వస్తుండటం, ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెంది శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. తాంసి మండలం పొన్నారి శివారులోని తన చేనులో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం అటువైపు వెళ్లిన వారు తాంసి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోతన్నకు భార్య రుక్మిణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భర్తే కాలయముడు

- హైడోస్ మత్తు ఇంజెక్షన్ ఇవ్వడంతో భార్య మృతి
- ముక్కు మూసి, గొంతు నులిమి ఇద్దరు కూతుళ్ల హత్య
- కారుతో చెట్టుకు ఢీకొట్టి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ
- ఓ మహిళతో వివాహేతర బంధం మత్తులో దారుణం
- ఖమ్మం ఏసీపీ వెల్లడి

భార్యాపిల్లలతో ప్రవీణ్ (ఫైల్)

రఘునాథపాలెం, జూలై 14: ఇటీవల ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం బావోజీతండాకు చెందిన ఒక మహిళ, ఇద్దరు కూతుళ్లు కారు ప్రమాదంలో చనిపోయిన ఘటనలో విస్తుగొలిపే నిజాలు బయటపడ్డాయి. ఈ కేసును విచారించిన పోలీసులు.. 'అది యాక్సిడెంట్ కాదు. ముగ్గురిదీ హత్యే' అని నిర్ధారించారు. ఆదివారం రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో ఖమ్మం ఏసీపీ రమణమూర్తి మీడియాకు వివరాలు వెల్లడించారు. బావోజీతండాకు చెందిన బోడా ప్రవీణ్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో ఫిజియోథెరపి డాక్టర్‌గా పని చేస్తున్నాడు. ప్రవీణ్‌కు భార్య కుమారి (26), ఇద్దరు కుమార్తెలు కృతిక (4), త్రుషిక (3) ఉన్నారు. ప్రవీణ్.. అదే దవాఖానలో నర్స్‌గా పనిచేస్తున్న కేరళకు చెందిన సోనీ ప్రాన్సిస్‌తో వివాహేతర సంబంధం నెరుపుతున్నాడు. భార్యను, పిల్లలను చంపితే సోనీ ప్రాన్సిస్‌తో సంతోషంగా ఉండొచ్చని భావించాడు. మే 28న భార్య, పిల్లల ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించేందుకు ముగ్గురినీ కారులో ఎక్కించుకొని ఖమ్మం తీసుకొచ్చాడు. తిరిగి వెళ్తుండగా భార్య తనకు ఒంట్లో బాలేదని చెప్పింది. ఇదే అదునుగా భావించిన ప్రవీణ్.. ప్లాన్ ప్రకారం అప్పటికే తెచ్చి కారులో పెట్టుకున్న హైడోస్ మత్తు ఇంజెక్షన్‌ను కుమారికి వేశాడు. దీంతో ఆమె మత్తులోకి వెళ్లింది. వెంటనే ఇద్దరు కుమార్తెలను కారు దింపాడు. ఒకరి తరువాత మరొకరిని ముక్కు, నోరు మూసి హత్య చేశాడు. ఆ తరువాత పిల్లలను కారు ముందు సీటులో పడుకోబెట్టాడు. ముగ్గురూ రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్టుగా చిత్రీకరించేందుకు.. హర్యాతండా వద్ద మూలమలుపులో కారుతో చెట్టుకు ఢీకొట్టాడు. ఆ ప్రమాదంలోనే భార్య, కుమార్తెలు చనిపోయినట్టు నమ్మించాడు. మొదట రోడ్డు ప్రమాదంగా కేసు నమోదు చేసిన పోలీసులు.. మృతుల శరీరంపై ఎలాంటి గాయాలూ లేకపోవడంతో అనుమానించారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా తానే ముగ్గురినీ హత్య చేసినట్టు అంగీకరించాడు. ఈ ఘటనలో హంతకుడు ప్రవీణ్‌తోపాటు హత్యకు ప్రేరేపించిన ప్రియురాలు సోనీ ప్రాన్సిస్‌పైనా పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రవీణ్‌ను రిమాండ్‌కు తరలించినట్టు ఏసీపీ తెలిపారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.